## క్లుప్తంగా

### 'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలు విన్నవించుకున్నారు. ప్రజా వినతులను కె.కె.రాజు పరిశీలించి కొన్ని వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు నామమాత్రం



గురుద్వారా దరి రెస్టారెంట్ సెల్లార్‌లో, ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న వ్యాపారాలు

సీతమ్మధార: ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో జీవీఎంసీ జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. కోట్ల రూపాయలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లపై ప్రైవేట్ వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు, పాదచారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యపై 'ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురించిన వార్తకు పట్టణ విభాగం అధికారులు గురుద్వారా దరి ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాల వద్దకు వెళ్లి కుర్చీలు తీసేయండని తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి వెళ్లిపోయారు. వారు వెళ్లిన గంటలోనే యథావిధిగా వ్యాపారాలు సాగిస్తున్నారు. గురుద్వారా, సీతమ్మధార, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో కిందిస్థాయి సిబ్బంది అండదండలు చూసుకొని ఫుట్‌పాత్‌లతోపాటు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుతున్నారు.

### నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

### కుష్టురోగులకు వస్తువుల వితరణ



కుష్టురోగులకు వస్తువులు పంపిణీ చేస్తున్న డీపీఎంవోలు రామకృష్ణ, ప్రసాదరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్టునివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం 'స్పర్శ' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవివరంలోని ఏఎంజీ లెప్రసీ కాలనీలో 53 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు డిప్యూటీ పారా మెడికల్ అధికారులు .కె.ప్రసాద రావు,పి.రామకృష్ణ బియ్యం, పప్పు, పండ్లు,సెల్ఫ్ కేర్ కిట్స్, మందులు పంపిణీ చేశారు. వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను, మందులు వాడడం గురించి రోగులకు వివరించారు. డీపీఎంవో పి.రామకృష్ణ, ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.



కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

# 'ఆరోగ్య సురక్ష'.. పేదలకు రక్ష

- జగనన్న వైద్య శిబిరాలకు విశేష స్పందన
- 51వ వార్డులో 350 మందికి వైద్య సేవలు

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట పెన్నిధిగా మారింది. రెండో విడత కార్యక్రమంలో భాగంగా 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) పరిధికి సంబంధించి మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 288 మహత్ కాలనీ సచివాలయం పరిధిలోని ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. తొలుత నేత్ర నిపుణులతో ఆయన కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రక్త పరీక్షలు చేయించుకుంటున్న పేషెంట్లు

ప్రజల చెంతకే వైద్య సేవలు, ఉచిత మందులు అందజేస్తున్నారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. ప్రజల చెంతకే వైద్యం అందించడం ఏ ప్రభుత్వంలోనూ ఇంతవరకూ జరగలేదని.. వైఎస్సార్‌సీపీ సర్కారు వచ్చాక ఇలాంటి సదుపాయాలు ప్రజలకు కల్పించిందని చెప్పారు.

**అన్ని రకాల వైద్య పరీక్షలు**

మెడికల్ క్యాంప్‌లో సాధారణ వైద్యం, నేత్ర, చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) వంటి స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించారు. మొత్తంగా 350 మందికి పైగా రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు. వివిధ రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

**ఎంతో ఉపయోగకరం**



యూపీహెచ్‌సీలు ఉన్నా సరే ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వం పేదలకు అనేక విధాలుగా మేలు చేస్తోంది. నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. సాధారణ వైద్యం కోసం వచ్చాను. మంచి సేవలు అందించి ఉచితంగా మందులు ఇచ్చారు.

– శ్రీదేవి, పంజాబ్ హోటల్, 51వ వార్డు

# సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతిపత్రం అందిస్తున్న సింగాలమ్మపురం వాసులు

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే, ప్రజలందరూ సంక్షేమ ఫలాలు పొంది సుఖసంతోషాలతో జీవించాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఏర్పాటు కావాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 45వ వార్డు భీమిలి పరిధిలోని సింగాలమ్మపురంలో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శిలాఫలక ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ పరిపాలిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో భీమిలి పెద్దదని, సుమారు 126 సచివాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

యాలు తన పరిధిలో ఉన్నాయని తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో పర్యటించి, సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కాని సింహాచలం దేవస్థానం సమస్య సీఎం చొరవతో ముందుకు వెళ్తుందని, ఇన్నేళ్లుగా ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల మరమ్మతులకు అనుమతులు ఇప్పించారని తెలిపారు. త్వరలోనే కోర్టులో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేలా ముఖ్యమంత్రి జగన్ తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరై, పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కార్పొరేటర్ హనోకుతో కలిసి ముత్తంశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఈఈ మత్స్యరాజు, ఏఈ ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు రాజు యాదవ్, బాబూరావు, సురేష్, కనకరాజు, ఎల్లాజీ, రవిశంకర్, నాయుడు, శ్యామ్, శ్రీహరి, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## జీఆర్పీ అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్‌ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్, తమ తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన ఒక జువైనల్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, జువైనల్ జస్టిస్ హోంకు నిందితుడిని తరలించారు.

## ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

# పండగల వేళ మొక్కలు నాటుదాం

డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపు

తాటిచెట్లపాలెం: సామూహిక మొక్కల పెంపకం ద్వారా డివిజన్ పరిధిలో జరిగే అన్ని ఉత్సవాలు, పండగలను జరుపుకుందామని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వసంత పంచమి సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో బుధవారం పలు రైల్వే కాలనీలు, పార్కుల్లో సుందరీకరణలో భాగంగా పూల మొక్కలను డీఆర్‌ఎం చేతుల మీదుగా నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచేలా అవగాహన కల్పిస్తూ, ప్రోత్సాహపరిచేందుకు ఈకార్వో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలను పెంచడం, వాటిని బహుమతులుగా ఇచ్చి వేడుకలు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, ఇతర అధికారులు, ఈకార్వో ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్‌తో కలిసి మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

# భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన హనుమద్వైభవ ప్రవచనాలు



హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.



కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్

## పరిశోధకుల మెస్ పరిశీలన



మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, కిచెన్ పరిశీలించారు. హాస్టల్ మెస్‌లో సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం విద్యార్థుల భోజన సదుపాయాలు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు వున్నారు.

# ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు నిండి, 45 సంవత్సరాల లోపు, ఇంటర్ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## పుల్వామా దాడిలో అమరులకు ఘన నివాళి

బీచ్‌రోడ్డు: పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు బీజేపీ నాయకులు బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, నాయకులు ప్రకాష్ రెడ్డి, ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# 'ఉత్తర' అభివృద్ధి పనులపై సమీక్ష



కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో బుధవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, జేసీఎస్ ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణ పనులు, కమ్యూనిటీ హాల్స్, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రెయిన్లు, ఓటర్ వెరిఫికేషన్, నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, మండల అధ్యక్షులు జి.వి.రమణి, కృష్ణారావు మాస్టార్, జేసీఎస్ ఇన్‌చార్జులు అమర్‌రెడ్డి, బులుసు జగదీష్, వసంతల అప్పారావు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తాటిచెట్లపాలెం: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో గురువందన్ చాత్ర అభినందన్ (వసంత పంచమి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి విభాగం అధ్యక్షురాలు సత్యశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విధులు నిర్వర్తిస్తున్న జాతీయ పురస్కార గ్రహీతలైన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడి ఘటనలో అసువులు బాసిన దేశ వీర సైనికులకు నివాళులర్పించారు. పుల్వామా దాడి ఘటనను, సైనికుల త్యాగాలను విద్యార్థులకు నృత్యరూపకం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో బ్రిగేడియర్ సత్య, రియర్ అడ్మిరల్ టి.సుధాకర్, విశ్వతేజ స్కూల్ కరెస్పాండెంట్ ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఐ.సునీత, భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయి విభాగం సభ్యులు సునీత, ఉషా చీరాల, అనిత మోయుత, సుజాత, పిరమిడ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇందిరా, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అతిథులు, ఝాన్సీ లక్ష్మీబాయి విభాగం సభ్యులు

# సామూహిక అక్షరాభ్యాసాలు

సీతమ్మధార: వసంత పంచమి సందర్భంగా బుధవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిన్నారుల చేత ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో వంశీ బృందంచే సరస్వతి గుడిలో అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా గణపతి పూజ చేసి చిన్నారులతో పలకపై అక్షరాలు రాయించారు. అనంతరం ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకున్నారు.

- సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలోని డీబీఎస్ స్కూల్‌లో జ్ఞానసరస్వతి దివ్య ఆశీస్సులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పలక, పుస్తకాలు అందజేశారు.
- గురుద్వారా దరి వసంతబాల స్కూల్‌లో అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు.



నార్త్ ఎక్స్‌టెన్షన్ దేవాలయంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసాలు చేయిస్తున్న అర్చకులు

**బీవీకే హైస్కూల్‌లో సరస్వతీ దేవి పూజ**

ద్వారకానగర్‌లోని బీవీకే హైస్కూల్ లో బుధవారం సామూహిక అక్షర స్వీకార మహోత్సవం, సరస్వతీ దేవి పూజ, హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణమాచార్యులు, స్కూల్ డైరెక్టర్ స్వర్ణలత, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిశు క్షైత్రనిక్ వ్యవస్థలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రేమ సందేశాత్మకం

సీతమ్మధార: వాలెంటైన్స్ డే సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రామకథ–ప్రేమసుధ అనే అంశంపై సాహితీవేత్త సిహెచ్.చినసూర్యనారాయణ ప్రసంగించారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కె.జి.వేణు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేమ మానవ జీవితంలో ముఖ్య భూమిక పోషిస్తూ మానవ విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. ఈ ప్రేమ ఘట్టాలు రామాయణంలో ఎక్కువగా కనిపించి, సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. రామాయణంలో తండ్రీకొడుకుల ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, స్నేహితుల ప్రేమ, ప్రజలు–ప్రభువు ప్రేమ ఆయా పాత్రల్లో మనకు కనిపిస్తుంటాయన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డి.వి.సూర్యారావు, కొత్తూరు రమణ, కె.భీమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న చిన సూర్యనారాయణ

# పారిశ్రామిక సమ్మె జయప్రదానికి పిలుపు

సీతమ్మధార: నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నర్సింగరావు ప్రారంభించారు. జగదాంబ, లేపాక్షి, చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు మీదుగా సాగిన ర్యాలీ తిరిగి జీవీఎంసీ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టదాయకమైన చట్టాలు చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థల పరం చేయడానికి పూనుకుందన్నారు. 2024 ఎన్నికల్లో మోదీ తిరిగి అధికారంలోకి వస్తే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు గత మూడేళ్లుగా ప్రజలు ఉద్యమం సాగిస్తుంటే దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. 16వ తేదీ పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అచ్యుతరావు, ఆర్ఎస్‌వీవీ కుమార్, కె.ఎం. శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, దేవా, పి.మణి, పడాల రమణ, రెహ్మాన్, వై.రాజు, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

## విశాఖలో ప్రాంతీయ ఆర్టీసీ ఆస్పత్రి నిర్మించాలి



మాట్లాడుతున్న దామోదరరావు

ఉక్కునగరం: విశాఖలో 25 పడకల ప్రాంతీయ ఆర్టీసీ ఆస్పత్రి నిర్మించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు కోరారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన స్టీల్‌సిటీ డిపోను సందర్శించారు. అక్కడ జరిగిన ఈయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో ఆస్పత్రి నిర్మిస్తే చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ఉద్యోగులకు వైద్యసదుపాయం అందుతుందన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు లేఖ అందించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, విజయనగరం జోనల్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్, విశాఖ జిల్లా అధ్యక్షులు కె.ఎస్.ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.